క్లుప్తంగా

నేడు అయ్యప్ప సన్నిధిలో ఆరాట్టు ఉత్సవం



పెందుర్తి: సుజాతనగర్‌లోని పూర్ణపుష్కల సమేత ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయంలో స్వామి జన్మదినం సందర్భంగా శుక్రవారం అరాట్టు ఉత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖరెడ్డి తెలిపారు. శబరిమల ఉత్సవం తరహాలో ఇక్కడ కూడా జరుగుతుందన్నారు. ఉదయం స్వామివారికి సుప్రభాతసేవ, గణపతి హోమం అనంతరం నవద్రవ్య అభిషేకాలు చేస్తామన్నారు. అనంతరం గోత్ర నామార్చనలు జరుగుతాయని చెప్పారు. మధ్యాహ్నం ప్రసాద వితరణ, సాయంత్రం భక్తిగీతాలాపన జరుగుతుందన్నారు. భక్తులంతా ఉత్సవంలో పాల్గొనాలని కోరారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో లలితకుమారి

సబ్బవరం: మండలంలోని మొగలిపురం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహార పక్షోత్సవాలను గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్ సీడీపీవో లలితకుమారి మాట్లాడుతూ పౌష్టికాహారంతోనే గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ నెల 22 వరకు ఈ పక్షోత్సవాలు కొనసాగుతాయన్నారు. మహిళలు గర్భం దాల్చిన నుంచి బాలింతలు, చిన్నారులకు వివిధ దశల్లో ఇవ్వాల్సిన పౌష్టికాహారం గురించి వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు వై.ఇందిర, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాలిమర్స్ పరిహారం అందనివారి వివరాలు తేల్చండి

- 200 మంది ఫిర్యాదుతో స్పందించిన యంత్రాంగం

మహారాణిపేట: ఎల్జీ పాలిమర్స్ నుంచి తమకు నష్టపరిహారం అందలేదని సుమారు 200 మంది బాధితులు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో దరఖాస్తులు చేశారు. దీనిపై అధికారులు స్పందించారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశాల మేరకు కలెక్టరేట్ యంత్రాంగం గతంలో ఎల్జీ పాలిమర్స్‌లో ఎంత మందికి నష్టపరిహారం ఇచ్చారు.. ఇంకా ఎంత మంది ఉన్నారో తెలియజేయాలని జీవీఎంసీ యూసీడీ పీడీకి లేఖ రాశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరవాడ: వాడచీపురుపల్లి రూరల్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో చేపట్టనున్న మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫలితంగా నాయుడుపాలెం, వాడచీపురుపల్లి, దోసూరు, ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం గ్రామ పంచాయతీలకు విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

రాంకీ కూడలిలో చలివేంద్రం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న విశాఖ ఫార్మాసిటీ ఎండీ డాక్టర్ లాల్‌కృష్ణ

పరవాడ: జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీ రాంకీ సౌజన్యంతో రాంకీ కూడలిలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని విశాఖ ఫార్మాసిటీ ఎండీ డాక్టర్ లాల్‌కృష్ణ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా వేసవిని దృష్టిలో పెట్టుకుని ఏర్పాటు చేస్తున్న చలివేంద్రం పాదచారులు, ఉద్యోగులు, కార్మిక వర్గాలకు ఉపయోగకరంగా ఉంటోందన్నారు. చలివేంద్రం ద్వారా చల్లని మజ్జిగ, స్వచ్ఛమైన తాగునీటిని ఉదయం 10 నుంచి సాయంత్రం 4 వరకు అందుబాటులో ఉంచుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫార్మాసిటీ డీజీఎం గిరిధర్‌రావు బక్షి, లైజనింగ్ ఏజీఎం రాఘవరెడ్డి, రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ డాక్టర్ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

పెందుర్తి: సకల సదుపాయాలున్న ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన, విలువలతో కూడిన విద్య అందుతుందని మండల విద్యాశాఖ అధికారులు-1, 2 కె.సువర్ణ, టి.మధుమూర్తి అన్నారు. బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. మండలంలోని సరిపల్లి, రాయవరపువానిపాలెం, నీలకంఠపురం అంగన్‌వాడీ కేంద్రాలను, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను గురువారం సందర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సౌకర్యాల గురించి తల్లిదండ్రులకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందాయన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని సూచించారు. మొత్తం 12 అడ్మిషన్లు చేశారు. హెచ్‌ఎంలు లక్ష్మి, శిరీష, నాయుడుబాబు, తల్లిదండ్రుల కమిటీల ప్రతినిధులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి రైతుకు తమ భూమిపై శాశ్వత హక్కు దక్కేలా జగనన్న శాశ్వత భూ హక్కు-భూ రక్ష పథకంలో సమగ్ర భూ సర్వే చేపట్టారు. పట్టాదారు పాసు పుస్తకాలందించారు. దీనిపై ఎన్నో ఆరోపణలు చేసి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, అదే రీ సర్వేను యథావిధిగా కొనసాగిస్తోంది. సబ్బవరం మండలంలోని గుల్లేపల్లి గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. జనవరిలో ప్రారంభమైన సర్వే ఈ నెలాఖరులోగా పూర్తికానుంది. 90 శాతం మేర పూర్తయిన సర్వేలో ఎక్కడా గత ప్రభుత్వంలో చెప్పుకోదగ్గ తప్పులు జరిగినట్లు తేల్చలేకపోయారు.

పేరు మారినా.. అదే తీరున!



గుల్లేపల్లిలో రైతుల సమక్షంలో క్షేత్రస్థాయి సర్వే నిర్వహిస్తున్న రీ సర్వే బృందాలు

గుల్లేపల్లిలో భూముల సమగ్ర రీ సర్వే → పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన ప్రభుత్వం → ప్రతిపక్షంలో విమర్శించి.. అధికారంలోకి వచ్చాక అనుసరించి → జనవరిలో ప్రారంభం.. నెలాఖరులోగా పూర్తికి లక్ష్యం → ఇప్పటికే 90 శాతం పూర్తయిన రీ సర్వే

సబ్బవరం:

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రెవెన్యూ రికార్డుల స్వచ్ఛీకరణలో భాగంగా సర్వే ఆఫ్ ఇండియాతో కలిసి సమగ్ర భూ సర్వే నిర్వహించింది. దశాబ్దాలుగా రైతులు భూమిని సాగుచేస్తున్నా వారి పేర్లు రెవెన్యూ రికార్డుల్లో లేకపోవడం, కమతాల విభజన తదితర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో సబ్బవరం మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి, తొలుత కొన్ని గ్రామాల్లో సర్వే జరిపారు. సత్ఫలితాలు రావడంతో మండలంలోని గ్రామాలతో పాటు జిల్లా వ్యాప్తంగా చేపట్టారు. ఇదే తీరున రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో జరిగింది.

ఆరోపణలు రుజువు చేయలేక..

భూ హక్కు-భూ రక్షపై ఎన్నికల సమయంలో తీవ్ర ఆరోపణలు గుప్పించి, రైతుల్లో భయాందోళన పెంచడంలో కూటమి నేతలు విజయం సాధించారు. తీరా అధికారం చేపట్టాక అదే సమగ్ర రీ సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించి గత ప్రభుత్వ తప్పుల్ని ఎత్తిచూపాలనుకున్నారు. ప్రజల నుంచి ఫిర్యాదుల కోసం రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసినా.. ఎక్కడా తప్పులు జరిగినట్లు చెప్పలేకపోయారు. దీంతో మండలానికో గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసుకుని ఈ నెలాఖరులోగా సర్వే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నారు. ఇప్పటి వరకు జరిగిన సర్వేలో చిన్నచిన్న పొరపాట్లు మినహా, తప్పిదాలేవీ గుర్తించలేకపోయారు.



రీ సర్వే అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దార్ చిన్నికృష్ణ

ఆరు బృందాలు.. నలుగురేసి సిబ్బంది

ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్టులో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని గుల్లేపల్లి గ్రామాన్ని సమగ్ర రీ సర్వేకు పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. గ్రామాన్ని ఆరు బ్లాక్‌లుగా, ఒక్కో బ్లాక్‌కు 250 ఎకరాలు ఉండేలా విభజించారు. ప్రతి బ్లాక్‌కు ఓ సర్వే బృందం చొప్పున ఆరు సర్వే బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో ఒక వీఆర్వో, ఇద్దరు సర్వేయర్లు, ఒక వీఆర్ఏ ఉంటారు. జనవరి 1న రీ సర్వే ప్రారంభించి అదే నెల 28 నుంచి మార్చి 5 వరకు రైతుల భూముల ఆధారంగా ప్రతి రైతుకు మూడు రోజులు ముందు సమాచారం అందించారు. ఇరుగు పొరుగు రైతుల సమక్షంలో వారి సాగు హక్కులు కలిగిన భూ విస్తీర్ణం, వ్యక్తిగత వివరాలను నమోదు చేశారు.

రీ సర్వే నిర్వహిస్తున్న గుల్లేపల్లి వివరాలు

మొత్తం భూ విస్తీర్ణం	1681.60 ఎకరాలు
జిరాయితీ భూమి	1243.97 ఎకరాలు
ప్రభుత్వ భూమి	437.63 ఎకరాలు
గ్రామంలో రైతులు(ఖాతాలు)	1974
సర్వే నెంబర్లు	390
సర్వే సబ్ డివిజన్‌లు	6,065



మల్లునాయుడుపాలెం సచివాలయంలో రైతులకు 9(2) నోటీస్‌లు అందిస్తున్న రెవెన్యూ సిబ్బంది

అభ్యంతరాలు పరిశీలించాకే తుది జాబితా

గుల్లేపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలో గుల్లేపల్లి, మల్లునాయుడుపాలెం గ్రామాల రైతులు ఉన్నారు. జనవరిలో ప్రారంభమైన ఫీల్డ్ సర్వే మార్చి 5 నాటికి పూర్తయ్యింది. డెస్క్ వర్క్ కూడా పూర్తిచేసి ఈ నెల 7 నుంచి రైతులు సాగు హక్కు కలిగివున్న భూముల సర్వే నెంబర్లను ఎల్‌పీఎం నెంబర్లుగా మార్చుచేసి, ఆయా రైతులకు 9(2) నోటీస్‌లు జారీ చేస్తున్నారు. వీటిపై అభ్యంతరాలున్న రైతులు 21 రోజుల్లో నివేదిస్తే, వాటిని సరిచేస్తారు. అభ్యంతరాల్లేని భూములను రికార్డు చేసి తుది జాబితాను గ్రామ సభల్లో ప్రదర్శిస్తారు.

రికార్డుల్లోకి మొత్తం భూమి



మాకు 46 సెంట్లు వారసత్వంగా వచ్చిన భూమి ఉంది. చుట్టు పక్కల రైతుల సమక్షంలో రీ సర్వే చేయడంతో 44 సెంట్లుగా తేలింది. 9(2) నోటీస్ ఇచ్చారు. గతంలో 24 సెంట్లకు మాత్రమే పట్టాదార్ పాస్ పుస్తకం ఉండేది. మిగిలిన భూమి నోషనల్ ఖాతాలో ఉండేది. ఇప్పుడు భూమి మొత్తం రికార్డయింది.

– సిరపరపు వెంకటరమణ, రైతు, మల్లునాయుడుపాలెం

అధికారులు శ్రద్ధ తీసుకోవాలి



మాకు వారసత్వంగా వచ్చిన 1.20 ఎకరాల భూమి గ్రామంలో ఉంది. గ్రౌండ్ సర్వేలో రెండు, మూడు సెంట్ల తేడా వచ్చింది. ఇటీవల మా సోదరుడు 11 సెంట్లు కొనుగోలు చేస్తే ఒక సెంట్ వ్యత్యాసం ఉంది. జాతీయ రహదారులను అనుకుని ఉన్న విలువైన భూములు కావడంతో అధికారులు మరింత శ్రద్ధ తీసుకోవాలి.

– గొర్లి కనకరాజు, రైతు, మల్లునాయుడుపాలెం

నెలాఖరులోగా సర్వే పూర్తి



పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన గుల్లేపల్లి గ్రామంలో రీ సర్వే 4(జనవరి నుంచి ఏప్రిల్) మాసాల్లో పూర్తిచేయాలని లక్ష్యం. ఇప్పటికే 90 శాతం సర్వే ప్రక్రియ పూర్తయింది. అనుకున్న సమయానికి పొరపాట్లు లేకుండా సర్వే పూర్తి చేస్తాం. రైతుల నుంచి సహకారం బాగుంది. దీంతో రీ సర్వే గ్రామంలో చురుగ్గా సాగుతోంది.

– బి.చిన్నికృష్ణ, తహసీల్దార్

మహిళా చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలి



ఆందోళన చేస్తున్న మహిళా సమాఖ్య ప్రతినిధులు

పెందుర్తి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల రక్షణ కోసం రూపొందించిన చట్టాలు మొక్కుబడి తంతుగా మారుతున్నాయి తప్ప, మహిళలకు నిజంగా రక్షణ కల్పించేలా లేవని మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఎం.ఎ.బేగం ఆక్షేపించారు. ఇటీవల కాలంలో ప్రేమోన్మాదుల చేతుల్లో హత్యలకు, అఘాయిత్యాలకు గురవుతున్న ఘటనలకు నిరసనగా స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బేగం మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న విశాఖ నగరంలో మహిళలకు రక్షణ లేకుండా పోతోందన్నారు. రాష్ట్ర హోం మంత్రి జిల్లాలోనే ఇలాంటి దారుణాలు చోటు చేసుకుంటే, మిగిలిన ప్రాంతాల్లో పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. నిందితుల పట్ల ప్రభుత్వం మెతక వైఖరి, రాజకీయ స్వార్థం వలనే ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా పోలీస్ వ్యవస్థ తమ విధి నిర్వహణకు లోబడి నిందితులను పట్టుకోవడంతో పాటు, ప్రభుత్వాలు కూడా పారదర్శకంగా చట్టాలను అమలు చేస్తేనే మహిళలకు రక్షణ లభిస్తుందన్నారు. సమాఖ్య ప్రతినిధులు రాధ, అన్నపూర్ణ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

భవిత కేంద్రానికి సామగ్రి వితరణ



దివ్యాంగులకు హెల్తీ స్నాక్స్ అందిస్తున్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు

పరవాడ: స్థానిక భవిత కేంద్రంలో దివ్యాంగులకు పీవై నాయుడు అండ్ కో కంపెనీ సొంత నిధులు రూ.25 వేలతో సమకూర్చిన వస్తువులను పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు, సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు గురువారం అందజేశారు. ఎంపీపీ మాట్లాడుతూ భవిత కేంద్రంలో చదువుతున్న దివ్యాంగులను ఆదుకోవడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి సాయిశైలజ, స్థానిక నాయకులు పైల రామచంద్రరావు, రెడ్డి శ్రీనివాసరావు, టి.వెంకటరావు, సీహెచ్ కనకారావు, పైల హరీష్, రాంకీ హెచ్ఆర్ గిరిధర్ బక్షి, శ్రీకాంత్, భవిత కేంద్ర ఉపాధ్యాయులు టి.కుమారి, జి.శ్రీనివాసరావు, దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గమాంబ పండగలు



బొడ్డపువానిపాలెం దుర్గమాంబ సన్నిధిలో భక్తులు



మామిడివానిపాలెం దుర్గమాంబ

పరవాడ: మండలంలోని ఈ బోనంగి శివారు బొడ్డపువానిపాలెంలో కొలువుదీరిన దుర్గమాంబ పండగ మహోత్సవాలను గ్రామ ప్రజలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మాజీ మండల అధ్యక్షుడు బొడ్డపు చిన్నారావు, సర్పంచ్ బొడ్డపు శ్రీనివాసరావులు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. స్థానిక లివింగ్ పీపుల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఉచిత ప్రసాద వితరణ, మంచినీరు అందించారు. ఉప సర్పంచ్ మేడిశెట్టి వెంకటరమణ దంపతులు, సంస్థ అధ్యక్షుడు బొండా తారక రమేష్‌కుమార్ కూటమి నాయకులు పంచకర్ల ప్రసాద్, బుగిడి రామగోవిందరావు, వియ్యపు చిన్న, వర్రి పరదేశినాయుడు, బాలాజీనాయుడు, పైల దినేష్, నగిరెడ్డి చిన్నారావు, వెన్నల నరసింగరావు తదితరులు దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు.

- కన్నూరు శివారు మామిడివానిపాలెం గ్రామంలో దుర్గమాంబ పండగను శీరంశెట్టివానిపాలెం, మామిడివానిపాలెం గ్రామాల ప్రజలు గురువారం ఘనంగా జరిపారు. వేకువ జాము నుంచి అమ్మవారికి ధూపదీప నైవేద్యాలతో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల కోసం పలు స్వచ్ఛంద సంస్థలు మజ్జిగ, ఉచిత ప్రసాదాలను అందించాయి. నేల డ్యాన్సులు, కోలాటాలు, తప్పెటగుళ్ల, మేళతాళాలతో అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించి, రాత్రికి బాణ సంచా వెలుగుల నడుమ అనుపు మహోత్సవాన్ని వేభవంగా నిర్వహించారు.

చందనోత్సవంలో స్వచ్ఛంద సంస్థల పాత్ర కీలకం



సమావేశంలో పాల్గొన్న వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

సింహాచలం: ఏటా చందనోత్సవంలో స్వచ్ఛంద సంస్థలు భక్తులకు అందించే సేవలు ఎంతో గొప్పవని సింహాచలం దేవస్థానం డిప్యూటీ ఈవో రాధ కొనియాడారు. ఈ నెల 30న జరిగే చందనోత్సవాన్ని పురస్కరించుకుని భక్తులకు సేవలంచేందుకు ముందుకు వచ్చిన సుమారు 30 స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సింహగిరిపై కొత్తగా నిర్మిస్తున్న క్యూకాంప్లెక్స్‌లో గురువారం సమావేశం నిర్వహించారు. చందనోత్సవం రోజు ఎవరెవరు ఏయే ఆహార పదార్థాలు, స్నాక్స్, మజ్జిగ, మంచి నీరు, శీతల పానీయాలు, పాలు అందిస్తారో ఆయా స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తెలిపారు. వారు ఏయే ప్రాంతాల్లో భక్తులకు వాటిని అందించాలో నిర్ణయించి, ఆ వివరాలను అధికారులు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు, డీఈ నాగేశ్వరరావు, ఏఈలు సూరిబాబు, తాతాజీ, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



విద్యార్థులతో కలిసి వాహనదారులకు అవగాహన కలిగిస్తున్న ఎస్‌ఐ నరసింగరాజు

పెందుర్తి: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వెస్ట్ జోన్ ట్రాఫిక్ విభాగం ఎస్‌ఐ నరసింగరాజు అన్నారు. పెందుర్తి, సుజాతనగర్, వేపగుంట కూడళ్ల వద్ద గురువారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపితే రూ.10 వేలు జరిమానా విధిస్తామన్నారు. హెల్మెట్, కారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరి సహకారం అవసరం అని కోరారు. పూర్తిస్థాయిలో అవగాహన లేని తల్లిదండ్రులకు పిల్లలు ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన కలిగించాలని సూచించారు. పలు విద్యాసంస్థల విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.

వైభవంగా బంగారుమాంబ పండగ మహోత్సవం



బంగారుమాంబ సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: మండలంలోని గొర్లివానిపాలెం బంగారుమాంబ పండగ మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్, రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, పరవాడ జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, సర్పంచ్ గొర్లి గోపి అమ్మలు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. నేలడ్యాన్సులు, చిడతలు, తప్పెటగుళ్ల, డప్పు వాయిద్యాలతో అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. రాత్రి నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భారీ బాణసంచా నడుమ అమ్మవారి అనుపు మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు.

రీ సర్వేపై 21 రోజుల్లో అభ్యంతరాలు తెలపాలి



గ్రామ సభలో రైతులకు 9(2) నోటీస్‌లు అందిస్తున్న తహసీల్దార్ చిన్నికృష్ణ

సబ్బవరం: మండలంలోని గుల్లేపల్లి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ రీ సర్వే గ్రామ సభలో రైతులకు తహసీల్దార్ బి.చిన్నికృష్ణ చేతుల మీదుగా 9(2) నోటీస్‌లను గురువారం అందించారు. పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన గుల్లేపల్లిలో ఈ నెల 5తో క్షేత్రస్థాయి సర్వే పూర్తవడంతో నోటీస్‌లను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. రైతుల భూముల వివరాలతో కూడిన నోటీస్‌ల ఆధారంగా నమోదులో వ్యత్యాసాలు ఉంటే నోటీస్ ఇచ్చిన 21 రోజుల్లోగా అభ్యంతరాలను తమ దృష్టికి తీసుకొస్తే, పరిష్కరిస్తామన్నారు. గ్రామ సభలో తహసీల్దార్‌తో పాటు రీ సర్వే డీటీ తహసీల్దార్ గణపతిరావు, మండల సర్వేయర్ ఎల్.అప్పారావు, గ్రామ పెద్దలు బండారు శ్రీను, ఉప సర్పంచ్ గజ్జి దేముడుబాబు, గజ్జి నరసింగరావు, వీఆర్వో ఎస్.ముత్యాలనాయుడు, సచివాలయ సర్వేయర్లు వి.మానీష, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా సదస్సును విజయవంతం చేయండి



దేశపాత్రునిపాలెంలో సీపీఐ జిల్లా సదస్సు కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

పరవాడ: నర్సీపట్నంలో శుక్రవారం జరగనున్న సీపీఐ జిల్లా సదస్సును జయప్రదం చేయాలని పార్టీ అనకాపల్లి జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు పిలుపునిచ్చారు. దేశపాత్రునిపాలెంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సదస్సు కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా సదస్సుకు పార్టీ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ జేవీ సత్యనారాయణమూర్తి హాజరుకానున్నట్లు తెలిపారు. సదస్సులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై ఉద్యమ కార్యాచరణ గురించి చర్చించనున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు పాల్గొని, సదస్సును విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బూసి పరమేశ్వరి, జి.లక్ష్మి, నారాయణమ్మ, ఆశ, తులసి పాల్గొన్నారు.

పురుగు మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి



మృతుడు యంద్ర అర్జున(ఫైల్)

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరానికి చెందిన వ్యక్తి పురుగు మందు తాగి, చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్థానిక సీఐ పిన్నింటి రమణ తెలిపిన వివరాలు.. పాత సబ్బవరానికి చెందిన యంద్ర అర్జున పదేళ్లుగా కళాసీగా పనిచేస్తున్నాడు. మద్యం తాగే అలవాటుతో దీర్ఘకాలిక వ్యాధులకు గురయ్యాడు. ఈ నెల 7న కడుపునొప్పి రావడంతో భరించలేక పురుగుల(చెదల) మందు తాగాడు. దీన్ని గుర్తించిన భార్య రాము స్థానికుల సాయంతో నగరంలోని కేజీహెచ్‌కు తరలించింది. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు.

మృతునికి భార్యతో పాటు కుమారుడు వంశీ, కుమార్తె మేఘన ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

సింహగిరి ఫలసాయం తోటల్లో మంటలు



మంటలను అదుపుచేస్తున్న ఫైర్ సిబ్బంది

సింహాచలం: సింహగిరిపై ఫలసాయం తోటల్లో గురువారం మంటలు చెలరేగాయి. గజపతి సత్రం వెనుక హిల్‌టాప్ రోడ్డులో మధ్యాహ్నం సుమారు ఒంటి గంట సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో దేవస్థానం అధికారులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న మర్రిపాలెం అగ్నిమాపక కేంద్రం సిబ్బంది మంటలను అదుపుచేశారు. దేవస్థానం ఈఈ శ్రీనివాసరాజు తదితరులు పర్యవేక్షించారు.

కారు మబ్బులు..చిరు జల్లులు



వేసవితాపంతో అల్లాడిపోతున్న పెందుర్తి ప్రజలకు వరుణుడు కాస్త ఉపశమనం కలిగించాడు. గురువారం పగలంతా ఎండలు ఠారెత్తించాయి. సాయంత్రానికి సీన్ మారింది. ఆకాశం మబ్బులు పట్టింది. చల్లని గాలులతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. కారు మబ్బుల మాటున కాసేపు చిరు జల్లులు పలకరించాయి. పిడుగులు కాస్త అలజడి రేపినా.. చినుకులతో ప్రజలు సేదతీరారు. – పెందుర్తి